

గురువారం హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ టెంపుల్ బస్టాప్ వద్ద నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు. పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

# కాంగ్రెస్ వస్తే పెట్టుబడులు బంద్

- హస్తం పార్టీతో పరిపాలనలో అస్థిరత
- అభివృద్ధి, సంక్షేమం మా కులమతాలు
- 111 జీవోపై మాట నిలుపుకున్నాం
- రాష్ట్రం ప్రశాంతంగా ఉండాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలి
- వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల రోడ్‌షోలో మంత్రి కేటీఆర్



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన జనం

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ ): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పెట్టుబడులు ఆగిపోతాయని, అస్థిరపాలన మొదలవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. తొమ్మిదిన్నరేండ్లలో 10 లక్షల ఐటీ ఉద్యోగాలు వచ్చాయని, రియల్ ఎస్టేట్, నిర్మాణ, హాస్పిటాలటీ రంగాలు విస్తరించాయని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. వికారాబాద్ మరిపల్లి, చేవెళ్ల, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ అభ్యర్థులు మెతుకు ఆనంద్, కాలె యాదయ్య, మాధవరం కృష్ణారావు, వివేకానంద తరపున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా 8 చోట్ల కార్నర్ మీటింగ్‌లలో కేటీఆర్ మాట్లాడారు. మంచిచేసే ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని, కులమతాల మధ్య చిచ్చుపెట్టే మూకలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి తమ మతమని.. సంక్షేమం తమ కులమని పునరుద్ఘాటించారు. ఈ తొమ్మిదిన్నరేండ్లలో కులాల కుంపట్లు, మతాల మంటలు లేవని, హైదరాబాద్ అభివృద్ధే ల క్ష్యంగా బీఆర్ఎస్ పాలన సాగిందని వివరించారు. డబుల్ ఇండ్లు, పెన్షన్లు, కల్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం, హైదరాబాద్ ప్రగతి, పురోగతి దిశలో సాగాలంటే కేసీఆర్ పాలన అవసరమని నొక్కి చెప్పారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన కాపు, కమ్మ, క్షత్రియ వర్గాలకు సైతం భూములు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ప్రశంసించారు. మరింత అభివృద్ధి జరగాలన్నా బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలని కేటీఆర్ కోరారు.

### బీజేపీకి బీ టీం అయితే కేసులు ఎందుకు?

రాహుల్ వచ్చి బీజేపీకి బీఆర్ఎస్ బీ టీం అంటారని, తమది బీటీం అయితే కేసులు ఎందుకు పెట్టారని కేటీఆర్ ప్రశ్నించారు. తమను బెదిరించారని, భయపెట్టారని పేర్కొన్న కేటీఆర్.. మెడ తెగినా ఢిల్లీకి తలవంచేది లేదని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో ముస్లిం మైనార్టీలకు కేవలం 230 కోట్లు ఖర్చు చేస్తే, కేసీఆర్ ప్రభుత్వం 12 వేల కోట్ల ను ఖర్చు చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ముస్లింలను ఓటు బ్యాంకుగానే చూసిందని విమర్శించారు. రాష్ట్రంలో మూడెకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులు ఎవరూ లేరని, వారికి 3 గంటల కరెంటు సరిపోతుందని, 10 హెచ్‌పీ మోటారు చాలన్న రేవంత్ వ్యాఖ్యలను గుర్తు చేస్తూ.. కాంగ్రెస్ కావాలో? కరెంటు కావాలో? ఆలోచించుకోవాలని ప్రజలకు సూచించారు.

> బీఆర్ఎస్ స్కీముల పార్టీ.. కాంగ్రెస్ స్కాముల పార్టీ. బీఆర్ఎస్ రైతుబంధు పార్టీ.. కాంగ్రెస్ రాబందుల పార్టీ. మళ్లీ వారిని తెచ్చుకుందామా? ఆగం కాకుండా ఆలోచించండి. బీజేపీ సన్నాసులకు మతం పేరిట చిచ్చుపెట్టుడు తప్ప మరేం తెల్వదు. -మంత్రి కేటీఆర్

### హామీలన్నీ నెరవేర్చుతున్నాం

రంగారెడ్డి జిల్లాలో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న 111జీవో ఎత్తేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. 111 జీవో ఎత్తివేతతో చేవెళ్ల, మొయినాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల రైతులందరికీ లాభం చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో హైదరాబాద్‌లో ప్రతి రోజూ తాగునీటిని ఇస్తామని, నగరంలో మరిన్ని ఫ్లై ఓవర్లు నిర్మించుకుందామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆడబిడ్డల పెండ్లికి 'కల్యాణలక్ష్మి'ని అందిస్తున్నట్టుగానే, మళ్లీ అధికారంలోకి వచ్చాక ప్రతి మహిళకు సౌభాగ్యలక్ష్మి పేరిట ప్రతినెలా 3 వేలు ఇస్తామని తెలిపారు. పెన్షన్లు పెరుగతాయని, సన్నబియ్యం పంపిణీ చేస్తామని చెప్పారు. రైతులకు జీవితబీమా అందిస్తున్న ఏకైక నాయకుడు కేసీఆర్ అని ప్రశంసించారు. తెల్లరేషన్‌కార్డు కుటుంబాలకు 'కేసీఆర్ బీమా.. ఇంటింటికీ ధీమా'తో 5 లక్షల బీమా కల్పిస్తామని వివరించారు. డిసెంబర్ 3 తర్వాత గ్యాస్ సిలిండర్‌ను 400కే అందిస్తామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితిని 15 లక్షలకు పెంచుతామని పేర్కొన్నారు.

### ప్రతిపక్ష గజనీలకు అభివృద్ధి కనిపించడం లేదు

హైదరాబాద్ అభివృద్ధి చూసి రజనీకాంత్‌లాంటి ప్రముఖులే ఆశ్చర్యపోతుంటే ఇక్కడి ప్రతిపక్ష గజనీలు దానిని గ్రహించలేకపోతున్నారని కేటీఆర్ విమర్శించారు. మెరుగైన వసతులు, శాంతియుత వాతావరణం వల్లే పెట్టుబడులు వస్తున్నాయని, తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. స్థిరమైన ప్రభుత్వం, బలమైన నాయకత్వం ఉన్నప్పుడే హైదరాబాద్ బాగుంటుందని, నగరం బాగుంటేనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

### సింహం సింగిల్ మాదిరిగా కేసీఆర్

కాంగ్రెస్, బీజేపీ నాయకులకు చేవ, సత్తా లేదని కేటీఆర్ విరుచుకుపడ్డారు. తెలంగాణకు కట్టుబడి పనిచేస్తున్న కేసీఆర్‌ను నిలువరించేందుకు బీజేపీకి చెందిన 15 రాష్ట్రాల సీఎంలు, కేంద్రమంత్రులు, ఇతర నాయకులు.. కాంగ్రెస్ నుంచి రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే వంటి నాయకులు హైదరాబాద్‌లో దిగుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ మాత్రం సింగిల్‌గానే వస్తున్నారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ కే నవీన్‌కుమార్, ఎంపీ రంజిత్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

> అలకలు, అసంతృప్తులు ఎక్కడైనా ఉంటాయి. అలిగినా, గులిగినా ఓటు మాత్రం బీఆర్ఎస్‌కే గుద్దండి. కాంగ్రెస్ వస్తే హైదరాబాద్ ప్రగతి కుక్కలు చింపిన విస్తరే. పనిచేసే ప్రభుత్వాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉంది. -మంత్రి కేటీఆర్

## మా కంటే ఎక్కువ ఉద్యోగాలిచ్చిందెవరు?

- రాహుల్‌గాంధీ నిరూపించగలరా?
- కర్ణాటక యువతను విజయవంతంగా మోసం చేశారు
- మండిపడ్డ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగాల్లో తెలంగాణ కంటే ఎక్కువ ఖాళీలను భర్తీ చేసిన రాష్ట్రాన్ని చూపించగలరా? అంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సవాల్ విసిరారు. గురువారం ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్ స్పందిస్తూ.. 'కర్ణాటక యువతను విజయవంతంగా మోసం చేసిన రాజకీయ నిరుద్యోగ స్కాంగ్రెస్, ఇప్పుడు తెలంగాణకు వచ్చి పెద్ద పెద్ద హామీలు ఇస్తున్నది' అని ఎద్దేవా చేశారు. 2.50 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కర్ణాటక ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, కాంగ్రెస్ పార్టీ యువతను విజయవంతంగా మోసం చేసిందని వ్యాఖ్యానించారు. అదే సమయంలో కరువు ప్రాంతం అనే స్థాయి నుంచి దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ చేరిందంటే మాటలా! అని అన్నారు. తొమ్మిదేండ్లలోనే రైతును రాజును చేసిన ఘనత కేసీఆర్‌ది అని తెలిపారు.

### పవర్‌ఫుల్ లీడర్‌తో పవర్‌ఫుల్ తెలంగాణ

తెలంగాణ పవర్‌ఫుల్ లీడర్ కేసీఆర్‌తో పవర్‌ఫుల్‌గా మారిందని కేటీఆర్ అన్నారు. ఒకప్పుడు కరెంటు కోతలు, అస్థిరమైన విద్యుత్తు సరఫరా, పవర్ హాలిడేస్‌తో దెబ్బతిన్న ప్రాంతం ఇప్పుడు తలసరి విద్యుత్తు వినియోగంలో అగ్రస్థానంలో ప్రకాశిస్తున్నదని వెల్లడించారు. పవర్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడానికి, విస్తరించడానికి, బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త సబ్‌స్టేషన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసిందని వివరించారు. గ్రిడ్ వైఫల్యం సంభవించినప్పుడు కూడా నిరంతర విద్యుత్తు సరఫరా కోసం నగరాన్ని పవర్ ఐలాండ్‌గా మార్చామని గుర్తుచేశారు.

## కేసీఆర్ దీక్ష చేయకుంటే తెలంగాణ ప్రకటన చేసేవారా?

- దానిని వెనక్కి తీసుకోవడంతోనే రాష్ట్రంలో యువకుల ఆత్మహత్యలు
- ఉద్యోగాల భర్తీ గురించే మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదు
- చిదంబరం వ్యాఖ్యలను తిప్పికొట్టిన బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య



హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ నిరవధిక దీక్ష చేయకపోతే తెలంగాణపై ఆనాటి హోంశాఖ మంత్రి చిదంబరం ప్రకటన చేసే వారా? అని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ప్రశ్నించారు. గురువారం ఆయన తెలంగాణభవన్‌లో మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేత పీ చిదంబరం సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. తెలంగాణ చరిత్రను చిదంబరం వక్రీకరించారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటనను చిదంబరం వెనక్కి తీసుకున్నందువల్లనే తెలంగాణలో వందలాది యువకులు బలిదానం చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇస్తున్న ఆరు గ్యారెంటీలను అప్పులు చేయకుండా, భూములు అమ్మకుండా అమలు చేయగలరా? అని నిలదీశారు. వాస్తవాలు చెప్పి కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి వెళ్ళలేరా? అని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి 1.90 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, అప్పటికి కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నదని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం 2.25 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసిన విషయం తెలియదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 80 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని విమర్శించే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదని స్పష్టంచేశారు. రాజకీయ దురుద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, రాజ్యాంగానికి లోబడి తెలంగాణ అప్పులు తీసుకుంటున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా లక్షల కోట్లు అప్పులు చేస్తున్నదని వివరించారు. అప్పులు చేస్తున్న రాష్ట్రాల్లో అరుణాచల్‌ప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉంటే, తెలంగాణ 22వ స్థానంలో ఉన్నదని చెప్పారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే రాజస్థాన్ అప్పుల గురించి మాట్లాడాలని సవాల్ చేశారు. దేశంలో 2004 నుంచి 2014 వరకు రూ.2.20 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేయగా.. ఆ తర్వాత వచ్చిన మోదీ ప్రభుత్వం కేవలం 1,000 మందికి రూ.14 లక్షల కోట్లు మాఫీ చేసిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నాయకులకు చరిత్ర తెలియదనడం ఆశ్చర్యకరంగా ఉన్నదని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితులపై మాట్లాడటానికి తెలంగాణ కాంగ్రెస్‌లో మాట్లాడే వారు లేరా? అని ఎద్దేవా చేశారు. చిదంబరం ఇక్కడికి వచ్చి మాట్లాడటం ఇక్కడి కాంగ్రెస్ నాయకులకు అవమానకరమని చెప్పారు.



తెలంగాణభవన్‌లో పారిశ్రామికవేత్తలు, బిల్డర్లను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్



కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ నేత రాంరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

## బీఆర్ఎస్‌లోకి పారిశ్రామికవేత్తల క్యూ


- వరుస కట్టిన బిల్డర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతర నాయకులు
- హైదరాబాద్, కామారెడ్డికి చెందిన పలువురు గులాబీ పార్టీలో చేరిక
- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): వివిధ స్థాయి రాజకీయ నేతలతోపాటు పారిశ్రామికవేత్తలు, కుటీర పరిశ్రమల నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, బిల్డర్లు బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు క్యూకడుతున్నారు. హైదరాబాద్‌సహా దాదాపు అన్ని జిల్లాల్లో ఈ సందడి నెలకొన్నది. బీఆర్ఎస్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకే వారంతా జైకొడుతున్నారు. ఈ మేరకు గురువారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలతోపాటు కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కామారెడ్డి నియోజకవర్గంలోని మాచారెడ్డి మండలం అక్కాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మీనర్సింహారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిల్డర్, పారిశ్రామికవేత్త ముత్యాల నర్సింహారెడ్డి, మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. జీహెచ్ఎంసీ పరిధిలోని బిల్డర్లు రంగారవి, ప్రసాద్, అనిల్ కట్టూరి, వెంకటరత్నం, ప్రసాద్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, పొన్నాల రమేశ్‌రెడ్డి, తకూరి జగదీశ్వర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, ప్రాణుథాన్‌రెడ్డి, సత్యనారాయణ, సంగమేశ్వర్ తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో లోయపల్లి చిన్న నర్సింగరావు, లక్ష్మీరావులపల్లి ఉపసర్పంచ్, ఫోరం అధ్యక్షుడు బెంజరం నవీన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత రంగారాయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కారెక్కిన దండెం రాంరెడ్డి

ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత దండెం రాంరెడ్డి గురువారం మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ బలోపేతానికి తీవ్రంగా శ్రమించిన రాంరెడ్డి.. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా నిలిచారు. ఆపద సమయంలోనూ ఆదుకున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా పోటీపడ్డారు. ఒకానొక దశలో ఆయనకే టికెట్ వస్తుందని అందరు భావించినా.. చివరి నిమిషంలో టికెట్ దక్కలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ఓటమే ధ్యేయంగా పనిచేస్తానని దండెం రాంరెడ్డి చెప్పారు. నియోజకవర్గంలో తన సత్తా ఏమిటో చూపిస్తానని అన్నారు.

## లోకం పోకడ




వేదిక మీదున్న పార్టీ నేతలు దయచేసి వేదిక కింద ఉన్న స్థలాన్ని అలంకరించాలని కోరుతున్నా!

## 28 వేల మందికి ఇంటి వద్దే ఓటు హక్కు

- అత్యధికంగా సిద్దిపేటలో 757 మందికి అవకాశం
- అత్యల్పంగా అలంపూర్, జహీరాబాద్‌లో 12 మందికి..

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): 28,057 మంది ఓటర్లు ఇంటి వద్దే ఓటేసే సదుపాయాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. పోస్టల్ బ్యాలెట్ కోసం 44,097 మంది దరఖాస్తు చేసుకోగా, అర్హత ఉన్న 28,057 మందికి అవకాశం కల్పించారు. వీరంతా ఓటు వేసే తేదీని ముందుగానే ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నిర్ణయిస్తారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా ఓటింగ్ ప్రక్రియను వీడియో ద్వారా చిత్రీకరిస్తారు. అత్యధికంగా సిద్దిపేట నియోజకవర్గంలో 757 మంది, బాల్కొండ 707, సత్తుపల్లి 706, పెద్దపల్లి 640, బహదూర్‌పురా 11 మంది, అలంపూర్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో 12 మంది చొప్పున ఎన్నికల సంఘం ఇంటి నుంచే ఓటేసే అవకాశం కల్పించింది.

## వర్షకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నల్లగొండ | 36.6°c | 19.0°c |
| రంగారెడ్డి | 33.7°c | 19.3°c |
| ఖమ్మం | 33.1°c | 14.2°c |
| ఆదిలాబాద్ | 32.9°c | 15.0°c |
| మెదక్ | 32.8°c | 14.7°c |
| వరంగల్ | 32.0°c | 20.0°c |
| హైదరాబాద్ | 31.6°c | 18.9°c |
| మహబూబ్‌నగర్ | 31.4°c | 20.6°c |
| కరీంనగర్ | 31.0°c | 19.0°c |
| నిజామాబాద్ | 30.3 °c | 18.3°c |

## నిపుణ
విద్య, ఉద్యోగ సమాచారం

### ఎస్‌బీఐలో..

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో మేనేజర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 42
- పోస్టులు: డిప్యూటీ మేనేజర్/మేనేజర్ (సెక్యూరిటీ)
- అర్హతలు, ఎంపిక తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 27
- వెబ్‌సైట్: https://bank.sbi/web/careers

### ఎన్‌ఎఫ్‌ఎల్‌లో..

నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్‌ఎఫ్‌ఎల్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 15
- పోస్టులు: అకౌంట్స్ అసిస్టెంట్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 1
- వెబ్‌సైట్: www.nationalferilizers.com

### ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఏఐ ఇంజినీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 52
- పోస్టులు: ఎగ్జిక్యూటివ్, జూనియర్ ఎగ్జిక్యూటివ్, ఆఫీసర్ (హెచ్ఆర్), డిప్యూటీ మేనేజర్, ఆఫీసర్ తదితరాలు
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: నవంబర్ 27
- వెబ్‌సైట్: https://aiesl.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- ఐఐటీ-నీట్ ఫౌండేషన్ ఫిజిక్స్, కరెంట్ అఫైర్స్, మ్యాథమెటిక్స్ (గ్రూప్స్, డీఎస్సీ) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.